సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం : 28 : అక్టోబర్ : 2023



మరోసారి జగన్‌కే పట్టం

సీఎం జగన్‌ను ప్రజలంతా మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి అన్నారు.

8లో ▸



పుష్కరిణి ముస్తాబు

ద్వారకాతిరుమలలో శ్రీవారి నరసింహ సాగరం (సుదర్శన పుష్కరిణి) కార్తీక మాసోత్సవాలకు ముస్తాబవుతోంది.

8లో ▸



పీజీటీ పోస్టులకు దరఖాస్తులు

హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీటీలుగా పని చేయడానికి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ తెలిపారు.

8లో ▸

సామాజిక ప్రభంజనం

తీరంలో జనాభిమానం పరవళ్లు తొక్కింది. వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన వచ్చింది. సంక్షేమం పొందిన వారంతా స్వచ్ఛందంగా కదిలారు. గ్రామగ్రామాన బ్రహ్మరథం పట్టారు. జగన్ ప్రభుత్వం బడుగులకు చేసిన మేలును మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరిస్తుంటే.. తమ బతుకుల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుని కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నరసాపురంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు అడుగడుగునా నీరాజనాలు పలికారు.

తీరం.. జన సంద్రం

- వైఎస్సార్ సీపీ బస్సు యాత్రకు అపూర్వ స్వాగతం
- నరసాపురంలో యాత్ర విజయవంతం
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు
- బహిరంగ సభకు పోటెత్తిన ప్రజానీకం

నరసాపురం: వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు నరసాపురం నియోజకవర్గంలో అనూహ్య స్పందన వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న యాత్ర గోదావరి జిల్లాలకు సంబంధించి నరసాపురంలో ప్రారంభం కావడం ఓ విశేషమైతే.. తొలిరోజు యాత్ర పండగ వాతావరణంలో మొదలుకావడం, మరోవైపు చిరువాన పడుతున్నా ఉత్సాహంగా సాగడం మరో విశేషం. గోదావరి జిల్లాల్లో పేర్గాంచిన పేరుపాలెం బీచ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలోని మొగల్తూరు సెంటర్‌లోని లక్ష్మీ కల్యాణ మండపం నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు యాత్ర ప్రారంభమైంది. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సీదిరి అప్పలరాజు, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు పోతుల సునీత, కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బర్రి లీల, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ తదితరులు బస్సుపై ఎక్కి యాత్రలో పాల్గొన్నారు.

కిక్కిరిసిన బహిరంగ సభా ప్రాంగణం

నరసాపురంలోని మెయిన్‌రోడ్డులో జైన్ డ్రెసెస్ ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించారు.





సభకు హాజరైన అశేష జనవాహిని, (ఇన్‌సెట్‌లో) సభలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, చిత్రంలో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సీదిరి అప్పలరాజు, పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

సంక్షేమ పథకాలకు రూ. 1,500 కోట్లు

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

సభకు నాయకత్వం వహించిన ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక నిధులు నరసాపురం నియోజకవర్గానికి వచ్చాయని చెప్పారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ లాంటి కీలక ప్రాజెక్ట్‌లకు కార్యరూపం వచ్చిందన్నారు. రూ.5 వేల కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనుమతులు ఇచ్చారని, పలు ప్రాజెక్టులకు ఆయనే స్వయంగా శంకుస్థాపన చేశారని చెప్పారు. ఇక నియోజకవర్గంలో రూ.1,500 కోట్లు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం వెచ్చించిందన్నారు.

సాయంత్రం 5.30 గంటలకు యాత్ర బహిరంగ సభా ప్రాంతానికి చేరుకుంది. అప్పటికే నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన జనంతో సభా ప్రాంతం కిక్కిరిసింది. బహిరంగ సభలో పలువురు మంత్రులు మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటుగా మిగిలిన అన్నివర్గాల వారి అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గజమాలలతో నాయకులకు స్వాగతం

అడుగడుగునా నీరా'జనాలు'

- బస్సు యాత్రకు ప్రజల నుంచి అడుగడుగునా ఆదరణ లభించింది.
- మొగల్తూరు నుంచి పులపర్తివారితోట, రామన్నపాలెం, జెట్టిపాలెం, ఎల్‌బీచర్ల, లక్ష్మణేశ్వరం గ్రామాల మీదుగా నరసాపురం పట్టణం వరకూ యాత్ర సాగింది.
- 17 కిలోమీటర్ల మేర నాయకులు బస్సులో యాత్ర సాగించారు.
- గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు యాత్రకు స్వాగతం పలికారు.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు నియోజకవర్గ నలుమూలల నుంచి చేరుకున్నారు.
- దారి పొడవునా నిలబడి జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు.
- పూలదండలతో నాయకులను ఆహ్వానించారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పింఛన్‌దారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చి యాత్రకు సంఘీభావం చెప్పడం విశేషం.

యాత్ర హైలైట్స్

- యాత్ర ప్రారంభంలో మొగల్తూరు కట్టుకాలువ వద్ద మంత్రులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
- మొగల్తూరుకు చెందిన మత్స్యకారులు మొగల్తూరులో కల్యాణ మండపానికి నిధులు కేటాయించాలని కోరుతూ మంత్రులు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు వినతిపత్రం ఇచ్చారు.
- యాత్ర లక్ష్మణేశ్వరం చేరుకోగానే మంత్రులు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు క్రేన్ సాయంతో ప్రజలు భారీ గజమాల వేశారు.
- యాత్రకు సంఘీభావంగా వివిధ గ్రామాల నుంచి పార్టీ యూత్ విభాగాల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీతో వచ్చి యాత్రలో జత కలిశారు.



బస్సు యాత్ర సభ వద్ద కరతాళ ధ్వనులు చేస్తున్న ప్రజలు



బహిరంగ సభలో కేరింతలు కొడుతున్న అభిమానులు



మొగల్తూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు



బస్సు యాత్రకు సంఘీభావంగా యువకుల బైక్ ర్యాలీ

న్యూస్‌రీల్

జెడ్పీ అధికారుల బాధ్యతల స్వీకరణ



అధికారులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా కేఎస్ఎస్ సుబ్బారావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారిగా సాల నిర్మలజ్యోతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వీరిని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో ముందుండాలన్నారు. సేవల ద్వారా జిల్లాపరిషత్‌కు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజాపరిషత్ పరిపాలనాధికారులు, పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోన్నూరి శ్రీధర్ రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుధాలపై అవగాహన అవసరం



ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: విధి నిర్వహణలో పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, పరికరాలపై విద్యార్థులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం భీమవరం డీఎస్పీ కార్యాలయం వద్ద పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పలు విషయాలు తెలుసుకోవచ్చని, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో ఉపయోగించే ఆయుధాలు, సాంకేతిక పరికరాలు వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆయుధాలు, సాంకేతిక పరికరాల పనితీరును ఆయన వివరించారు. డీఎస్పీ బండారు శ్రీనాథ్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీనివాస్, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు 13 చోట్ల ఆరోగ్య సురక్ష శిబిరాలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని 13 ప్రాంతాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు తెలిపారు. భీమవరం మండలంలో దుర్గాపురం, స్కావెంజర్ కాలనీ, చిన్నపేట, తాడేపల్లిగూడెం మండలం నవ్వారుపేట, ఇరగవరం మండలం రాపాక, నరసాపురం మండలం లిఖితపూడి, పాలకొల్లు మండలం ఉల్లంపర్రు, పోడూరు మండలం వద్దిపర్రు, తాడేపల్లిగూడెంలోని తాడేపల్లి-2, యలమంచిలి మండలం నారినమెరక, భీమవరంలోని వెంప-1, పెనుగొండ, పెంటపాడు మండలం కోరుమిల్లిలో సురక్ష శిబిరాలు జరుగనున్నాయని పేర్కొన్నారు.


పక్కాగా ఓటర్ల జాబితా తయారీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో నూరు శాతం కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై చర్చించారు. ముందుగా ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27 నాటికి జిల్లాలో 14,47,509 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుష ఓటర్లు 7,09,608 మంది, మహిళా ఓటర్లు 7,37,824 మంది కాగా థర్డ్ జెండర్ ఓటర్లు 77 మంది ఉన్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9లోపు తెలియజేయాలన్నారు. జనవరి 5న తుది ఓటర్ల జాబితా రూపొందిస్తామన్నారు. జిల్లాలో ఎన్నికల సామగ్రి తొలి దశ తనిఖీ ప్రక్రియ పూర్తికావస్తుందని, రోజుకు సుమారు 250 మెషీన్లు తనిఖీ చేస్తున్నారన్నారు. నియోజకవర్గాల వారీగా ఆచంటలో 1,77,441, పాలకొల్లులో 1,92,337, నరసాపురంలో 1,65,566, భీమవరంలో 2,48,331 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల డీటీ ఎం.సన్యాసిరావు, రాజకీయ పార్టీ ప్రతినిధులు కామన నాగేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), మరపట్ల శ్యాంబాబు (టీడీపీ), కాటూరి కరుణాకర్ (బీఎస్పీ), తమలంపూడి వంశీ శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), భూపతిరాజు శ్రీనివాసవర్మ (బీజేపీ) పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రథోత్సవం

ద్వారకాతిరుమలలో అట్టహాసంగా వేడుక

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా చినవెంకన్న రథోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణోత్సవం మరుసటి రోజు రథోత్సవం నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. ముందుగా ఆలయంలో ఉభయ దేవేరులతో స్వామిని తొళక్కం వాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట భజనలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ వాహనాన్ని రథం వద్దకు తీసుకువచ్చారు. రథంలోని సింహాసనంపై కల్యాణమూర్తులను వేంచేపు చేసి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అర్చకులు హారతులిచ్చారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాథరావులు రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బలిహరణ సమర్పించారు. అనంతరం రథయాత్రను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, కోలాట భజనలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి దివ్య రథం క్షేత్ర పురవీధుల్లో తిరుగాడింది. రథోత్సవ వేడుకలో చిత్ర విచిత్ర వేషధారణలు, కోబ్రా నృత్యాలు అలరించాయి. ఆలయ ముఖ మండపంలో స్వామివారు రుక్మిణీ సత్యభామ సమేత మురళీకృష్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు చక్రస్నానం, అనంతరం ధ్వజావరోహణ నిర్వహిస్తారు. రాజమన్నార్ అలంకరణలో స్వామి దర్శనమిస్తారు.





రథంలో ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న అర్చకుడు, భక్తజన సందోహం నడుమ రథోత్సవం





రథం వద్ద పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ, రుక్మిణీ సత్యభామ సమేత మురళీకృష్ణ అలంకారం

పారదర్శకంగా స్వామిత్వ సర్వే

కలెక్టర్ ప్రశాంతి

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వామిత్వ (గ్రామాల్లో ఇళ్లు, స్థలాలు) సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సర్వే ప్రక్రియను పరిశీలించేందుకు శుక్రవారం మండలంలోని వెలివర్రులో ఆమె పర్యటించారు. గృహ యజమానులకు సర్వే ప్రయోజనాలు వివరించారు. ఇంటి యజమానులకు పంచాయతీ కార్యదర్శి 9(2) నోటీసులు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో అధికారులతో ఆమె సమావేశమయ్యారు. సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని, ఇంటి యజమానులకు నోటీసులు అందించి వారి సమక్షంలో సర్వే చేయాలన్నారు. గ్రామ కంఠం భూములపై నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, గ్రామ కంఠ భూములు సర్వే చేసి నిబంధనల ప్రకారం భూమి అనుభవిస్తున్న వారికి యాజమాన్య హక్కు పత్రాలు అందించాలని సూచించారు. రహదారులు, డ్రైనేజీలు, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు, భవనాలు, అన్నింటినీ కచ్చితమైన ఆధారాలతో సర్వే చేయాలన్నారు. ఇంటి, స్థల యజమానులతో స్నేహపూరిత వాతావరణంలో మెలగాలన్నారు. ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ క్షేత్రస్థాయిలో సర్వే తీరును పరిశీలించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, ఈఓపీఆర్డీ కె.కొండలరావు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

టెన్త్ పరీక్ష ఫీజులు చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్‌తో పాటు ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ పి.శ్యామ్‌సుందర్ తెలిపారు. వచ్చేనెల 10 వరకు అపరాధ రుసుం లేకుండా, రూ.50 అపరాధ రుసుంతో వచ్చేనెల 16 వరకు, రూ.200 ఫైన్‌తో వచ్చేనెల 22 వరకు, రూ.500 అపరాధ రుసుంతో వచ్చేనెల 30 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.



క్లుప్తంగా

కారు ఢీకొని ఇద్దరు మృతి



కారు ఢీ కొనడంతో రెండు ముక్కలైన ద్విచక్ర వాహనం

కృత్తివెన్ను : కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండల పరిధిలోని లక్ష్మీపురం సమీపంలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. కృత్తివెన్ను ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన చేబ్రోలు నరసింహరావు(72), చేబ్రోలు నాగేశ్వరరావు (60) అన్నదమ్ములు. వీరిద్దరూ భీమవరంలోని బీసీ కాలనీలో ఉంటున్నారు. శుక్రవారం ద్విచక్రవాహనంపై భీమవరం నుంచి బంటుమిల్లి మండలం ఆర్తమూరులో బంధువుల ఇంటికి బయలుదేరారు. మూలలంక నుంచి భీమవరానికి వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరూ ఘటన స్థలంలోనే మృత్యువాత పడ్డారు. కారులోని వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారు ద్విచక్ర వాహనంతో పాటు రిటైనింగ్ వాల్‌ను ఢీకొంది. ద్విచక్ర వాహనం రెండుగా విరిగిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరోసారి జగన్‌కే పట్టం

- గోదావరి జిల్లాల్లో అత్యంత పటిష్టంగా వైఎస్సార్‌సీపీ
- పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి
- అధికారం దక్కదనే అక్కసుతోనే ప్రతిపక్షాల దుష్ప్రచారం: ఆళ్ల నాని



ఏలూరులో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి.. వేదికపై జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



సమావేశానికి హాజరైన పార్టీ కార్యవర్గ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, చైర్‌పర్సన్లు

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని... వై నాట్ 175 అనే జగనన్న స్ఫూర్తితో ప్రతిపక్షాల్ని రాబోయే ఎన్నికల్లో చావుదెబ్బ కొట్టడం ఖాయమని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. ఏలూరు శనివారపుపేట సారథి కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి భారీ ఎత్తున పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ప్రజాధనాన్ని లూటి చేసిన చంద్రబాబు

పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తూ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లోనే సొమ్ములు జమ చేస్తున్నారని చెప్పారు. నాడు చంద్రబాబు హయాంలో ప్రజాధనాన్ని లూటీ చేశారని, పథకాల పేరుతో తన అనుచరల జేబులు నింపారని విమర్శించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను వేధింపులకు గురిచేయటంతో పాటు ప్రజాధనాన్ని దోచుకుతిన్నాయని, నేడు సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. గతంలో పింఛను కోసం అవ్వాతాతలు ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు పడేవారని గుర్తు చేశారు. నేడు తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా పింఛను అందిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ గోదావరి జిల్లాలో అత్యంత పటిష్టంగా ఉందని, రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని చెప్పారు. పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తనూ గుర్తించి ప్రాధాన్యత ఇస్తామని భరోసా కల్పించారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ అవినీతి రహిత పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని మాట్లాడుతూ.. అధికారం దక్కదనే అక్కసుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపైనా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైనా ప్రతిపక్ష టీడీపీ, జనసేన దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. క్షేత్రస్థాయిలోనే ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. సీఎం జగనన్న సంక్షేమ పాలనలో పార్టీకి ప్రజలకు అనుసంధానంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించామని, రాబోయే కాలంలోనూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అభద్రతా భావంతో ప్రతిపక్షాలు ప్రజలకు అసత్యాలు ప్రచారం చేస్తూ, మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. సీఎం జగనన్నతోనే పేదలకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయంలో ప్రజలు ఉన్నారని చెప్పారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో నవరత్నాల పేరుతో ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఆనాడు దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ సంక్షేమ పాలనకు తెరతీస్తే.. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకు వేసి మరింత అద్భుతమైన పాలనతో ప్రజల మనసులు గెలుచుకున్నారని చెప్పారు. 2024లో ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం కైవసం చేసుకోవటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకటరమణ, వంకా రవీంద్రనాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, వీఆర్ ఎలీజా, తెల్లం బాలరాజు, మేకా వెంకట ప్రతాప అప్పారావు, దూలం నాగేశ్వరరావు, తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు, చైర్‌పర్సన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

ఈ సమావేశంలో సామాజిక సాధికార బస్సు యాత్ర పోస్టర్లను పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్ ఆవిష్కరించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

భీమవరం అర్బన్: అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగిడి పాలెం గ్రామ పంచాయతీలోని రెడ్డి చెరువు గ్రామానికి చెందిన దొంగ రాముడు (23) చేపలు, రొయ్యల చెరువులపై మేత కట్టే పనిచేస్తుంటాడు. కోడి పందేలు, పేకాట అలవాట్లు ఉండటంతో వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. గురువారం సాయంత్రం చేపల చెరువులకు వాడే గ్యాస్ ట్యాబ్లెట్స్ మింగడంతో వాంతులు అవడంతో కుటుంబ సభ్యులు భీమవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం చికిత్సం పొందుతూ రాముడు మృతి చెందాడు.

పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీటీలుగా పని చేయడానికి అర్హత ఆసక్తి కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు నవంబర్ 2 మధ్యాహ్నం ఒంటిగంట లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని కామవరపుకోట, టీ.నరసాపురం పాఠశాలల్లో ఫిజిక్స్ పీజీటీ, నిడమర్రు, కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సివిక్స్ పీజీటీ, సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కామర్స్ పీజీటీ, జీలుగుమిల్లి, కామవరపుకోట, ధర్మాజీ గూడెం, గూటాల, టీ నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కెమిస్ట్రీ పీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

నేడు శ్రీవారి ఆలయం మూసివేత

ద్వారకాతిరుమల: పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు యథావిధిగా ఆలయ ద్వారాలను అర్చకులు తెరచి సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పిస్తామని ఈఓ తెలిపారు.

నరసాపురం పురపాలక సంఘము

[illegible] (GGMP) [illegible]

ఇ-ప్రొక్యూరుమెంటు షార్టు టెండరు నోటీసు

[illegible]/2023-ఇ-1 | తేది:27.10.2023

1. [illegible] : 28.10.2023 [illegible] 11.30 [illegible]
2. [illegible] : 06.11.2023 [illegible] 04.00 [illegible]
3. [illegible] : 08.11.2023 [illegible] 04.30 [illegible]

ఇ-ప్రొక్యూరుమెంటు టెండరు నోటీసు

[illegible] 245/2023-ఇ-1 | తేది:27.10.2023

1. [illegible] : 29.10.2023 [illegible] 11.30 [illegible]
2. [illegible] : 14.11.2023 [illegible] 04.00 [illegible]
3. [illegible] : 14.11.2023 [illegible] 04.30 [illegible]

[illegible] www.eprocurement.gov.in [illegible]

నరసాపురం పురపాలక సంఘం | కమీషనర్
[illegible]

స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం



జిల్లా స్థాయి సెలక్షన్స్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్ఆర్‌సీపీ యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 15 నియోజకవర్గాలకు సంబంధించి కోకో, చెస్ అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు జిల్లాస్థాయి సెలక్షన్స్ పోటీలు శుక్రవారం తాడేపల్లిగూడెం తేతలి సత్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. వైఎస్సార్‌సీపీ నేత కొట్టు విశాల్ పోటీలను ప్రారంభించారు. 720 మంది ఖో ఖో క్రీడాకారులు, 350 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. సభకు హైస్కూల్ హెచ్ఎం మైనం సత్యనారాయణ అధ్యక్షత వహించగా డీవైఈఓ రవీంద్ర భారతి, తాడేపల్లిగూడెం, పెంటపాడు ఎంఈఓలు జ్యోతి, టీవీ రామకృష్ణలు హాజరయ్యారు. కొట్టు విశాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో క్రికెట్ స్టేడియం, మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ కృషి చేస్తున్నారన్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సెక్రటరీ ఖుద్దూస్, స్టేట్ అసోసియేషన్ సెక్రటరీ రామకృష్ణ, పీడీలు చింతకాయల సత్యనారాయణ, కట్టా నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఖో ఖో అండర్-17 విజేతలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 15 నియోజకవర్గాలకు సంబంధించి శుక్రవారం తాడేపల్లిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖో ఖో అండర్-14, 17, చెస్ పోటీలకు సెలెక్షన్స్ జరిగాయి. అండర్-17 ఎంపికలను శుక్రవారం రాత్రి వెల్లడించారు. బాలురు విభాగంలో బి.వినయ్ (గొల్లమడుగు), పి.జే.నాగ కళ్యాణ్ (లక్కవరం), పి.చందు (కె.గోకవరం), బి.శ్యామ్ (భీమవరం), జి.రాజు (జంగారెడ్డిగూడెం), బి.వీరేంద్ర (పెదపాడు), ఎస్.జే.నర్సింహరాజు (రాజవరం), ఎం.సాయి సంతోష్ (బొర్రెంపాలెం), వి.దుర్గా ప్రసాద్ (మోగల్లు), ఎస్‌కేఎస్ ప్రసాద్ (మోగల్లు), డి.లోకేష్ (లక్కవరం), సీహెచ్ రమణేష్ (పాలకోడేరు), కె.వంశీ (అనాకోడేరు), కె.చైతన్య (సిద్ధాపురం), ఎంవీ అనిల్‌కుమార్ (యర్నగూడెం), బి.సాయి (బొర్రెంపాలెం), కేబీఎన్‌వీ శ్రీహర్ష (ఇరగవరం), బాలికల విభాగంలో బుట్టాయిగూడెంకు చెందిన యూ.నక్షత్ర, ఎస్.సంజనా, కె.హారిక, కె.కీర్తన, సీహెచ్ వెంకట శివ, కె.దివ్యలు ఎంపిక కాగా, పి.గాయిత్రి (భీమవరం), ఎస్.సింగ భవాని (రామన్నపాలెం), కె.దీక్షిత (భీమవరం), పి.పద్మశ్రీ (సీతానగరం), యామిని సాయిశ్రీ (లక్కవరం), భువనేశ్వరి (రామన్నపాలెం), డి.నిఖిత శ్రీశాంతి (త్యాజంపూడి), ఎస్.సాయి లక్ష్మి (సీతానగరం), వై.తులసి (రాజవరం)లను ఎంపిక చేశారు.

కార్తీక మాసోత్సవాలకు పుష్కరిణి ముస్తాబు



పుష్కరిణిలోని తామరను తొలగిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి నరసింహ సాగరం (సుదర్శన పుష్కరిణి) కార్తీక మాసోత్సవాలకు ముస్తాబవుతోంది. వచ్చేనెల 14 నుంచి కార్తీకమాసం ప్రారంభం కానుంది. అందులో భాగంగా పుష్కరిణిలోని తామర తొలగింపు పనులను శుక్రవారం ప్రారంభించారు. భక్తులు కార్తీక స్నానాలను ఆచరించేందుకు వీలుగా పుష్కరిణి ఒడ్డున సిమెంట్ చప్టాను నిర్మిస్తున్నారు. కార్తీకమాసంలో వచ్చే క్షీరాబ్ది ద్వాదశి నాడు స్వామివారికి ఈ పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఆ సమయంలోగా సుందరీకరిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ప్రధానోపాధ్యాయుడి మృతి



ఇలపకుర్తి వెంకట కృష్ణారావు

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ షాక్‌తో సుభాష్ చంద్రబోస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇలపకుర్తి వెంకట కృష్ణారావు (61) మృతిచెందారు. శుక్రవారం స్కూల్ సమయమైనా ఆయన రాకపోవడంతో తోటి ఉపాధ్యాయులు ఫోన్ చేసినా స్పందించలేదు. ప్రధానోపాధ్యాయుడి రూముకు తాళం వేసి ఉండడంతో ఉపాధ్యాయులు రిజిస్టర్‌లో సంతకాలు పెట్టలేదు. కాసేపటికి ఉపాధ్యాయులకు కృష్ణారావు మృతి చెందిన సమాచారం తెలిసింది. యలమంచిలి మండలం బాడవ గ్రామానికి చెందిన కృష్ణారావు నరసాపురంలో కొత్తగా ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఇంటిని తడుపుదామని ఉదయాన్నే నిర్మాణం జరుగుతున్న ఇంటికి వెళ్లి తడుపుతుండగా విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో మోటర్ వైర్‌ను కదపగా షాక్ కొట్టి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న బంధువులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కన్నీరు మున్నీరయ్యారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి ఫొటో విడుదల



అనుమానాస్పద వ్యక్తి ఫొటో

తణుకు: తణుకు పరిసర ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అనుమానిత వ్యక్తి ఫొటోను తణుకు పట్టణ పోలీసులు శుక్రవారం విడుదల చేశారు. నలుపు రంగు వెస్పా మోటారుసైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నాడని చెప్పారు. తాళం వేసిన ఇళ్లలోకి చొరబడి బీరువాలోని బంగారం, వెండి వస్తువులతోపాటు నగదు దోచుకెళుతున్నట్లుగా అనుమానం ఉందని.. అతని ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. తణుకు పట్టణ సీఐ 94407 96640, తణుకు రూరల్ సీఐ 94407 96639, తణుకు పట్టణ ఎస్సై 91549 65934, తణుకు రూరల్ ఎస్సై 94407 96641 నెంబర్లకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

BUILDING FOR SALE

■ తాడేపల్లిగూడెం మహాలక్ష్మి నగర్ రోడ్ నెం.4 లో తూర్పు ఫేసింగ్ న్యూ కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్ (160 చ॥గ) అమ్మకమునకు కలదు సంప్రదించండి : 9492927725, 9347007821 [G-1263358]

LAND FOR SALE

■ కాకినాడ to యానాం రోడ్ మట్లపాలెం నందు 16 ఎకరాలు రొయ్యల చెరువు అమ్మకానికి కలదు. సంప్ర: 8688265996 [C-1263361]

Services

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6176]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2420]

BUSINESS OFFER

■ Swastika Services Pvt. Ltd. కంపెనీలో పనిచేయుటకు Male/Female ఏజెంట్స్ కావలెను. Qul:10th Class, మంచి జీతం+ Incentives. సంప్ర: 8267820117. [T-1200098]

■ మీకు తెలిసిన వంట నైపుణ్యంతో మీ ఇంట్లోనే క్లౌడ్ కిచెన్‌ని ప్రారంభించి స్థిరమైన ఆదాయాన్ని పొందండి. ఉచిత సెమినార్‌లో పాల్గొనేందుకై మీ సిటీపేరు వాట్సాప్ చెయ్యండి. Ph: 6309527444 [H-193261]

Wanted

■ బ్యాంకింగ్ అనుబంధ సంస్థ నందు రిక్రూట్‌మెంట్ మేనేజర్స్ కావలెను. వ: 20 to 70, స్త్రీ/పు, పార్ట్ / ఫుల్ టైమ్. అ: 10+, పిఎఫ్, జీతం, కమీషన్, ESI, ఇన్సూరెన్స్, ఇన్సెంటివ్ కలవు. ✆ 73969 82204 [R-6175]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్ గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801026]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20K, ఫోన్: 8977639662, 8977639663 [HA-765]

■ డ్వాక్రా మహిళలు,రిటైర్డ్,నిరుద్యోగులు పెట్టుబడి మీరే పెట్టుకొని ఇంట్లో ఉంటూ కొవ్వొత్తులు, పెన్సిల్స్, పేపర్ ప్లేట్స్ చేసి ఇవ్వండి వీక్లీ పేమెంట్, సబ్సిడీ లోన్స్. Ph: 9491993545 [H-781295]

■ కష్టమైనే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15000-40000/-ఫ్రీ రూమ్+భోజనం. Hyd, Ph: 8919613984 [HA-775]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91608 91122, 92814 52838 [B-1206459]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.







క్లుప్తంగా

ప్రజా భేరి యాత్రను జయప్రదం చేయాలి



యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ సెక్రటరీ చిర్ల పుల్లారెడ్డి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలో నవంబర్ 15వ తేదీన సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాభేరి యాత్రను జయప్రదం చేయాలని తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ చిర్ల పుల్లారెడ్డి కోరారు. యూనియన్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశానికి సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షత వహించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం ఇచ్చిన హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, రాజధాని నిర్మాణానికి నిధులు, కడప ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం, గిరిజన యూనివర్శిటీ, దుగ్గిరాయి పట్నం పోర్టు తదితరులు నేటికి అమలు కాలేదని విమర్శించారు. సమావేశంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

'గూడెం' ఏఎంసీ చైర్మన్‌గా సంపత్‌కుమార్ నియామకం



తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా ముప్పిడి సంపత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్, డైరెక్టర్ (గుంటూరు) ఉత్తర్వులు జారీ చేసినట్లు సంపత్‌కుమార్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, చైర్మన్‌గా ముప్పిడి సంపత్‌కుమార్, మరో 18 మందితో నూతన పాలకవర్గం ఏర్పాటు కానున్నది. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులురెడ్డి), సొసైటీ చైర్మన్లు జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, పరిమి తులసీదాస్, గుమ్మళ్ళ తాతారావు, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఫణి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రైవేట్ సర్వేయరు ఉండవల్లి ఫణి కుటుంబానికి రాష్ట్ర ఎల్‌టీ సి సంఘం సంతాపం వ్యక్తం చేసింది. గురువారం ఫణి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి రాష్ట్ర కమిటీ తరపున రూ. 2 లక్షల 66 వేల చెక్కును అందజేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలగల శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసకుమార్, కార్యదర్శి విజయరామకృష్ణ, స్టేట్ కోఆర్డినేటర్ పాలకొల్లు రామ్మోహన్, చైర్మన్ పీ మురళీకృష్ణ, తదితరులు ఫణి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేకాట స్థావరంపై దాడి

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. పెంటపాడు ఎస్సై జి. హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం గ్రామ శివారులో పంట పొలాలలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశారు. ఈ దాడిలో 4 గురిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.2650ల నగదు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

రూ.లక్ష పలికిన దుర్గమ్మ లడ్డు

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలోని విజయ కనకదుర్గమ్మ ఆలయం 39వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 108 కేజీల లడ్డుని రూ. 1,00,000కు వేలంపాటలో భక్తులు దక్కించుకున్నారు. దసరా శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద శుక్రవారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ యలమంచిలి రామాంజనేయులు(అంజి) అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో దక్కించుకున్నారు. అనంతరం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సాక్షి, భీమవరం: యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి నైతిక విలువలను పెంపొందించుకోవాలని భీమవరం వన్ టౌన్ సీఐ అడబాల శ్రీను అన్నారు. శుక్రవారం కేజీఆర్‌ఎల్ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పోలీసులకు ప్రత్యేకంగా ఎవరిపైనా కక్ష సాధింపులు ఉండవని ప్రజారక్షణే ధ్యేయంగా పనిచేస్తారన్నారు.

సురక్ష శిబిరాలతో పేదలకు మేలు

- తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం
- ఉచితంగా మందుల పంపిణీ



తాడేపల్లిగూడెం రూరల్: నవాబుపాలెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్



ఇరగవరం : ఏలేటిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష సభలో మాట్లాడుతున్న నాయకులు



పెంటపాడు: వల్లూరుపల్లి జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి హైమావతి



పెంటపాడు: పరీక్షల అనంతరం రోగులకు మందులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజారోగ్యంతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి ముంగిటే వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం 412 మందికి వైద్యులు సింధూ, శ్రీహర్ష, టి.గౌతమి, టి.సూర్యసుభాషిలు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు ఎ.కోట సత్యవాణి, కే.బాబ్జీ, పి.రవికుమార్, జి.కృపా జాకబ్, దివ్య జ్యోతి, కే.సూర్య, ఎంపీహెచ్ఎస్‌లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలేటిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఇరగవరం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు తెలిపారు. ఇరగవరం మండలంలోని ఏలేటిపాడు సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వివిధ విభాగాల నుంచి ప్రత్యేక వైద్య నిపుణులచే అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మరలా ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించగలిగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని స్పష్టం చేశారు. ప్రజలంతా ఆలోచించి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ శిబిరంలో 1252 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉప్పులూరి లావణ్య , గుడాల లక్ష్మీ, ఎంపీటీసీలు కొవ్వూరి విజయలక్ష్మీ, జిల్లా ప్రధాన కార్యదర్శి చోడే జోషి, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, అధికారులు మండల పార్టీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ కె శ్రీనివాస్ రెడ్డి, నాయకలు, తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యం.. జగనన్న ఆరోగ్య సురక్ష ధ్యేయం

పెంటపాడు: ప్రజలందరికీ ఆరోగ్యం అందించే మంచి లక్ష్యంతో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. పెంటపాడు మండలం వల్లూరుపల్లి గ్రామం సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యపరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం సరిగాలేని పేదప్రజలు నాణ్యమైన మంచి వైద్యం చేయించుకొనేందుకు ముందుకు రావాలన్నారు. కార్పొరేట్ తరహా ఆసుపత్రుల వైద్యం అందిస్తున్న ముఖ్యమంత్రి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. రాచర్ల, దర్శిపర్రు సొసైటీల అధ్యక్షులు కుంచే సుబ్రహ్మణ్యం, గుండుమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు దెయ్యం శ్రీనివాసరావు (అవతారం), ఎస్సీ నాయకులు వసంతాడ జోగేంద్ర, సర్పంచ్ దంగేటి రామారావు, పంచాయతీ కార్యదర్శి కేవీ రామారావు, ఎంపీడీవో బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, పార్టీ నాయకులు గుండుమోగుల చిన్న, జి. కృష్ణ, ఆనందరాజు, ముదునూరు, పెంటపాడు వైద్యసిబ్బంది రమణ, సత్యనారాయణ, పూజ్యం శ్రీనివాసశర్మ, మెర్సీ, కాంతామణి, పెంటపాడు వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక, ముదునూరు వైద్యాధికారిణి డాక్టర్ పూజిత, ఎస్వీ రమణ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం, జనతా చారిటబుల్ ట్రస్ట్ వారి పర్యవేక్షణలో దాత ఈత కోట తాతాజీ కుటుంబ సభ్యులు సహకారంతో కామినేని హాస్పటల్ విజయవాడ వారిచే పట్టణంలో శుక్రవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 154 మందికి వైద్యపరీక్షలు జరిగాయి. 62 మందికి గుండె స్కానింగ్ ఎకో టెస్ట్‌లు, 80 మందికి ఈసీజీలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వంగపండు రామమోహన్‌రావు, కార్యదర్శి సీహెచ్ జగదీష్, కోశాధికారి జి.హరిబాబు, గౌరవ అతిథిగా మదన్‌మోహన్ అగర్వాల్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణ, సుంకర శ్రీనివాస్, గ్రంధి సత్యనారాయణ, ఆంజనేయ స్వామి తదితరులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం

పెంటపాడు: మండలంలోని 29,30 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అలంపురం వెంకటరమణ ఛారిటీ ప్రతినిధి కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో సుగర్‌కు సంబంధించి పాదాలలో తిమ్మిర్లు, మంట, స్పర్శతగ్గుట, మానని పుండ్లు, పాదముల వంకర, ఇన్‌ఫెక్షన్ తదితర లక్షణాలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లార్వా దశలోనే దోమలను నివారించాలి



కుంచనపల్లి గ్రామంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: లార్వా దశలోనే దోమలను నివారించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో ఫీవర్ సర్వే, డ్రైడే, ఫ్రైడే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణంలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమలు కుట్టకుండా రాత్రి సమయాల్లో దోమ తెరలను వినియోగించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధ, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు దానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మణరావు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రాధాకృష్ణ, ఆశా కార్యకర్తలు సుధ, వాసంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ పరిధిలోని హెల్త్ సిబ్బందిచే డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 31, 32, 33 వార్డులలోల్లో శుక్రవారం ఫీవర్ సర్వేలు, ఫ్రై డే, డ్రై డే సర్వేలు నిర్వహించారు. వార్డు ఆరోగ్య కార్యదర్శులు వెంకట లక్ష్మి, చిన్న పాప, రమణ, సహాయకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సామర్థ్యం తెలుసుకొనేందుకు పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి, పాల్గొన్న హెచ్ఎంలు, ఇంజనీరింగ్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థుల మధ్య జ్ఞాన సామర్థ్యాలను తెలుసుకునేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి మాట్లాడుతూ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు తాడేపల్లిగూడెంలో 64 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లోని 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నవంబరు 3వ తేదిన పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా ఫలితాలను ఉన్నత స్థాయి అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. అనంతరం ఓఎంఆర్ షీట్‌పై హెచ్ఎంలు, ఇంజనీరింగ్ విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్లు శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. సీఆర్‌పీ నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల వద్ద ఈ-క్రాప్ నమోదు జాబితాలు



ఉప్పులూరులో ఈ-క్రాప్ నమోదుపై సోషల్ ఆడిటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఆకివీడు: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని నమోదులో తప్పుల్ని సరిజేసుకునే అవకాశాన్ని ఈ నెల 29 వరకూ ఉందని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కాళింగగూడెంలోని ఆర్బీకే వద్ద శుక్రవారం ఈ-క్రాఫ్ నమోదు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ ద్వారా రైతులకు కలిగే లాభాను వివరించారు. ఆకివీడు సహాయ సంచాలకుల పరిధిలోని ఆకివీడు మండలంలో 1878 మంది రైతులు 3,816 ఎకరాల్లో వరి సాగుకు ఈ-క్రాప్ నమోదు అయిందన్నారు. కాళ్ల మండలంలో 1855 మంది రైతులు 3,878 ఎకరాల్లోనూ, ఉండి మండలంలో 4,551 మంది రైతులు 10,792 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు ఈ-క్రాప్ నమోదు అయిందని శ్రీనివాసరావు వివరించారు.

ఉండిలో...

ఉండి: ఈ-క్రాఫ్ ద్వారా పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలతో కూడిన జాబితాలను ఆయా గ్రామ సచివాలయాల వద్ద నోటీసు బోర్డుల్లో ప్రదర్శించామని వాటిని ఈ నెల 29లోపు రైతులు సరిచూసుకోవాలని ఆకివీడు ఏడీఏ కేఎస్ఏ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పులూరు తదితర గ్రామాల్లో తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జాబితాలో రైతుల వివరాలను తప్పకుండా సరిచూసుకోవాలన్నారు. జాబితా ఏదైనా పొరపాటుగా నమోదైతే ఈనెల 29లోపు సరిచేయించుకోవాలన్నారు.

భారీగా అన్నసమారాధన



ఇరగవరంలో అన్న సమారాధనలో భోజనం చేస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: దసరా మహోత్సవాలు ముగిసాయి. దాంతో పలు గ్రామాల్లో అన్న సమారాధనలు శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఇరగవరం మండలంలోని వినాయక గుడి దగ్గర ఏర్పాటు చేసి అన్న సమారాధనలో పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, తణుకు పట్టణ నాయకులు మంగెన సూర్య, చిట్టూరి సుబ్బరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనకు హాజరైన మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవీ నవరాత్రి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా తణుకు సజ్జాపురంలోని శ్రీఏవ్వక్షమ్మ తల్లి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని మంత్రి కారుమూరి ప్రారంభించి స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో: దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా అత్తిలి శ్రీవిజయచాముండేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కందుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగుళంపాడు రోడ్డులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దసరా ముగింపు ఉత్సవాలు పురస్కరించుకొని జరిగిన ఈ అన్నసమారాధనలో 5 వేల మంది భక్తులు ఈ అన్న సమారాధనలో పాల్గొన్నారు.

పాఠశాలకు వంట సామగ్రి అందజేత



జగనన్న గోరుముద్ద వంట సామగ్రి, ఆట సామగ్రిని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తణుకు టౌన్: మండలంలోని వెంకట్రాయపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమానికి అవసరమైన వంట పాత్రలను వైఎస్సార్ సీపీ నాయకులు పాఠశాలకు అందజేశారు. శుక్రవారం పాఠశాలకు ప్రభుత్వం అందించిన జగనన్న గోరుముద్ద వంట పాత్రలతో పాటు విద్యార్థుల క్రీడలకు అవసరమైన ఆట వస్తువులను వైఎస్సార్‌సీపీ నాయకులు చదలవాడ బాబూరావు, తాతపూడి వరప్రసాద్‌లు సీసీహెచ్ పాఠశాల సిబ్బందికి అందజేసినట్లు హెచ్ఎం పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్ తెలిపారు. నాడు-నేడు ద్వారా పాఠశాలకు ఎన్నడూ లేని విధంగా పాఠశాలలో సౌకర్యాలు పెరిగాయని, వాటిని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పీసీ చైర్మన్ చింతలపూడి దుర్గాదేవి, జగనన్న గోరుముద్ద సీసీహెచ్ చదలవాడ ప్రశాంతి, ఉపాధ్యాయని ఎన్ అమ్మాజీ పాల్గొన్నారు.

పెరుగుతున్న హెచ్‌ఐవీ కేసులు

- ప్రభుత్వాలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా దారికి రాని వైనం
- అపరిచిత శారీరక కలయికలే కారణమంటున్న వైద్యాధికారులు
- తణుకు సేఫ్ కేర్ సెంటర్‌లో 21450 మంది బాధితులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్

తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌లో బాధితుల వివరాలు ఇలా..

సంవత్సరం	బాధితుల సంఖ్య	మందులు వాడేవారి సంఖ్య	మిస్సింగ్, డెత్.
2016	1906	1338	422
2017	2357	1615	549
2018	2979	2066	677
2019	3643	2583	787
2020	4008	2869	848
2021	4434	3235	899
2022	5025	3776	935
2023	5228	3968	946

తణుకు అర్బన్: హెచ్ఐవీ కేసుల నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా కేసుల సంఖ్య పెరుగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కేసులు పెరుగుతున్నప్పటికీ ఏడాది ఏడాదికి పాజిటివ్ రేటు తగ్గుతుండడం కొనమెరుపు. శస్త్రచికిత్సల్లోను, ఇతర అనారోగ్య సమస్యల్లోను వైద్యులు హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరిగా అమలు చేస్తుండడంతో వైరస్ రూపంలో దాక్కుని ఉన్న హెచ్ఐవీ బయటపడే పరిస్థితి వచ్చింది. గతంలో కంటే ఇప్పుడు ప్రజల్లో అవగాహన పెరగడంతో ధైర్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోను, ప్రైవేటు ఆస్పత్రుల ద్వారా ప్రైవేట్ ల్యాబ్‌లలోను హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వైరస్ బయటకు వస్తోంది. అయితే వ్యాధిని ముందే నిర్ధారించగలిగితే వైరస్ శరీరమంతా సోకకుండా నిరోధించవచ్చని, క్రమం తప్పకుండా మందులు వాడకం మొదలుపెడితే సాధారణ పౌరులతో సమానంగా ఉండవచ్చనేది వైద్యుల వాదన. హెచ్ఐవీ పాజిటివ్ అని తెలియగానే తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌లో మందులు వాడేందుకు వ్యాధిగ్రస్తులు వస్తుంటారు. వీరికి అన్ని పరీక్షలు నిర్వహించి వారి అవసరాన్ని బట్టి మందులను వాడిస్తుంటారు. ప్రైవేట్‌లో అత్యంత ఖరీదైన ఈ మందులను ఆర్థిక స్థోమత ఉన్నవారు గోప్యంగా ప్రైవేటు మందులు వాడుతున్నారు. అయితే సేఫ్‌కేర్ సెంటర్‌లో మాత్రం మందులకు సక్రమంగా రాకపోతే వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తుంటారు. అయినప్పటికీ మందులకు రాని వారి ఇళ్లకు వెళ్లి మరీ మందులు వాడేలా సంబంధిత విభాగ సిబ్బంది పనిచేస్తున్నారు.

శారీరక సంబంధమే ప్రధాన కారకం...

అపరిచిత వ్యక్తులతో జరిపే శారీరక కలయిక ద్వారానే అధికశాతం హెచ్ఐవీ సోకుతుందని, వాడిన సిరంజిలు, రక్తమార్పిడి ద్వారా కూడా ఈ వైరస్ సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే కాలానికనుగుణంగా సాంకేతికంగా వచ్చిన మార్పుల్లో భాగంగా వాడిన సిరంజిని వెంటనే డిస్పోజ్ చేసే పరిస్థితులురాగా, రక్తమార్పిడిలో సైతం పూర్తి పరీక్షలు నిర్వహించిన అనంతరం మాత్రమే రక్తమార్పిడి చేస్తుండడం వంటి విధానాల ద్వారా వ్యాధి సోకే విధానాన్ని పూర్తిగా అడ్డుకున్నారు. కాబట్టి కేవలం శారీరక కలయిక ద్వారా మాత్రమే హెచ్ఐవీ సోకుతుండడమే వాస్తవమని వైద్యులు నొక్కి చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉన్న వారిలో మాత్రం ఏళ్ల తరబడి వైరస్ బయట పడడం లేదని, ఏదైనా పరీక్షలు చేయించుకోవాల్సి వచ్చిన సందర్భంలో మాత్రమే బయట పడుతున్నట్లుగా తెలుస్తోంది. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 2016 సంవత్సరంలో సేఫ్ కేర్ సెంటర్ ప్రారంభించగా గత ఏడేళ్లగా ఇప్పటివరకు 29,580 మంది వ్యాధిగ్రస్తులు నమోదు కాగా ప్రస్తుతం 21,450 మంది మందులు వాడుతున్నారు. మిగిలిన 6063 మంది మిస్సింగ్‌తో పాటు డెత్‌లు కూడా అయిఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

మందులు వాడడం ద్వారా జీవనకాలం తగ్గదు



ప్రభుత్వ ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకుని హెచ్ఐవీ పాజిటివ్ అని తెలిసిన వెంటనే సేఫ్ కేర్ సెంటర్‌కు రిఫరల్స్ వస్తుంటాయి. బాధితులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి మందులు వాడిస్తూ వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు మారుస్తుంటాము. అంతేకాకుండా మందులకు రాని వారి ఇంటికి మా ప్రత్యేక టీం సభ్యులు వెళ్లి తీసుకువచ్చి మందులు వాడిస్తుంటాము. క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా సాధారణ పౌరులులానే సమాజంలో తిరగడంతో వారి జీవనకాలం తగ్గిపోకుండా చూసుకోవచ్చు. వైరస్‌ను ముందుగానే గుర్తించి మందులు వాడడం ద్వారా చాలా వరకు ఇబ్బందులు తక్కువగా ఉంటాయి.

– డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, తణుకు సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి

నేడు పెద్దింటమ్మ ఆలయం మూసివేత

ఆకివీడు: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం అమ్మవారికి నైవేద్యం సమర్పించిన తరువాత ఆలయాన్ని మూసివేయనున్నట్లు స్థానిక పెద్దింటి అమ్మ ఆలయ అర్చకులు పవన్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. శనివారం రాత్రి చంద్రగ్రహణం ఏర్పడనుందని అనంతరం ఆదివారం ఉదయం సూర్యోదయం తర్వాత ఆలయం తెరిచి సంప్రోక్షణ కార్యక్రమాలు పూర్తి చేసిన తరువాత భక్తుల దర్శనానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం
90102 23729
90100 68395
63097 62918
తణుకు
90108 43311
90100 51493
Office mail : tpgadvt@gmail.com